క్లుప్తంగా

నియోజకవర్గ కేంద్రంలో స్కిల్ హబ్

రాజానగరం: రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఒక స్కిల్ హబ్‌ని ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని అనుసరించి రాజానగరంలో స్కిల్ హబ్‌ని ప్రారంభించనున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎం.కొండలరావు తెలిపారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలోని కామన్ ప్రొడక్షన్ సెంటర్ భవనంలో స్కిల్ హబ్‌ని ఏర్పాటు చేసి, నిరుద్యోగులైన యువతకు వృత్తి పనులలో శిక్షణ ఇస్తామన్నారు. ఇందులో భాగంగా కొందరు యువకులకు ఎలక్ట్రీషన్ డొమెస్టిక్ సొల్యూషన్స్, యువతులకు టైలరింగ్‌లోను శిక్షణ ఇచ్చి ఉపాధి చూపించనున్నామన్నారు. 8వ తరగతి ఆపై విద్యార్హత ఉన్న యువత ఈ శిక్షణ కార్యక్రమాలకు అర్హులన్నారు. ఆసక్తి కలవారు 83285 07473 నంబరుకు ఫోన్ చేసి ఇతర వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

వైభవంగా కల్యాణం

మధురపూడి: కోరుకొండ కొండరోడ్డులోని రావి చెట్టు కింద వెలసిన రుక్మిణీ సమేత పాండురంగస్వామి కల్యాణం గురువారం వైభవంగా జరిగింది. ఈనెల 15న ప్రారంభమైన ఈ ఉత్సవాలు 18 వరకూ జరుగుతాయి. దీనిలో భాగంగా గురువారం ఉదయం 9.40 గంటలకు స్వామి కల్యాణం నిర్వహించారు. అలాగే శుక్రవారం అన్నసమారాధనను చేయనున్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



పెదపూడిలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరం

పెదపూడి: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీసత్యసాయిబాబా సేవ సమితి కాకినాడ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజులు అన్నారు. పెదపూడిలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. శిబిరంలో 126 మందికి వైద్య పరీక్షలు చేయగా వారిలో 18 మందికి ఆపరేషన్లు, 44 మందికి కళ్ల జోళ్లు అవసరమని గుర్తించి వారి వివరాలు నమోదు చేసుకున్నారు. శిబిరాన్ని ప్రారంభించిన గోవిందరాజులు మాట్లాడుతూ వేమగిరిలోని పరమ హంస యోగానంద నేత్రాలయం వారిచే కంప్యూటర్ ద్వారా చత్వార, తలపోటు పరీక్షలు చేసి మందులు ఇస్తారన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజానగరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషను పరిధిలో 11 కేవీ ఫీడర్ల మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారని ఏపీఈపీడీసీఎల్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. రాజానగరం, తూర్పుగానుగూడెం, పల్లకడియం, రామస్వామిపేట గ్రామాల్లో గృహాలు, వ్యవసాయ బోర్లకు సరఫరా ఉండదన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

సీతానగరం: మండలంలోని చినకొండేపూడి శివారున పేకాటాడుతున్న నలుగురిని అరెస్ట్ చేశామని ఎస్సై కె.శుభశేఖర్ గురువారం తెలిపారు. వారి నుంచి రూ.1,170 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు. నిందితులను కోర్టులో ప్రవేశపెడతామని తెలిపారు.

సామూహికంగా ఎలుకలను నిర్మూలించుకోవాలి



దోమాడలో అధికారులిచ్చిన బ్రోమోడయోలిన్ మందును చూపిస్తున్న రైతులు

పెదపూడి: రైతులంతా కలిసి సామూహికంగా ఎలుకలను నిర్మూలించుకోవడంతో అధిక దిగుబడులు సాధించొచ్చని మండల వ్యవసాయ శాఖాధికారి టీవీఆర్ మణిదీప్ అన్నారు. పెదపూడి మండలంలోని 18 గ్రామాల్లో గురువారం రైతులకు ఉచితంగా ఎలుకల నివారణ మందు బ్రోమోడయోలిన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మణిదీప్ మాట్లాడుతూ ఎలుకలు ఏటా 10 నుంచి 40 శాతం పంటను నాశనం చేస్తున్నాయన్నారు. బ్రోమోడయోలిన్ మందులో నూకలు కలిపి పొట్లాలుగా తయారు చేసి ఎలుకల బొరియల్లో పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు

సీతానగరం: రఘుదేవపురంలో శుక్రవారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ ఎస్.ప్రసన్నకుమార్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ డాక్టర్ సత్యం రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. శిబిరాన్ని గ్రామసర్పంచ్ ఐ.చంద్రలీల, వైఎస్సార్ సీపీ నాయకులు గెద్దాడ త్రిమూర్తులు ప్రారంభించారు. శిబిరానికి తరలివచ్చిన వారికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్ అవసరమైన వారిని ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు చేర్చడమే లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం



బిక్కవోలు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: కుల, మత, రాజకీయాలకతీతంగా ఇంటింటికీ సంక్షేమ పథకాలను చేర్చడమే లక్ష్యంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బిక్కవోలు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులైతే గృహసారథులు పార్టీకి ప్రజలకు మధ్య వారధులన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయో లేదా సమీక్షించడంతో పాటు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రజలకు ఏవైనా సమస్యలుంటే అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. గృహసారథులు ఇంటింటికీ వెళ్ళినప్పుడు వారి అనుమతితో సెల్‌ఫోన్, ఇంటి గోడపై మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు వేయాలన్నారు.

టీడీపీ వల్లే కెనాల్ రోడ్డు నాశనం

టీడీపీ వల్లే కెనాల్ రోడ్డు నాశనమైందని ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పర్యటన విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గ్రామగ్రామానికి తిరుగుతున్నా కనీసం 10 మంది నాయకులు కూడా రావడం లేదన్నారు. గ్రాసిం ఇండస్ట్రీపై చేస్తున్న వ్యాఖ్యలను ఖండిస్తూ కేపీఆర్ కంపెనీకి టీడీపీ హయాంలోనే అనుమతులిచ్చి ఇప్పుడిలా వ్యాఖ్యానించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయంలో మీకు అడగాలని ఉంటే చంద్రబాబునాయుడు, అప్పటి మంత్రి వర్గాన్ని అడగాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి, జిల్లా మహిళా సంక్షేమ సంఘ చైర్మన్ రొంగల పద్మావతి, సర్పంచ్ సుమలత, వైస్ ఎంపీపీలు బుద్దాల కన్నారావు, పెంకే ఏసురత్నం, మండల జేసీఎస్ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టడం అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ సునీత

రాజానగరం: బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించడం ద్వారా మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుదామని డిప్యూటీ తహసీల్దార్ ఎం.సునీత అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ మీటింగ్ హాలులో గురువారం నిర్వహించిన సమావేశంలో మండల స్థాయిలో బాల్య వివాహాల నిరోధక, పర్యవేక్షణ, చైల్డ్ లైన్ 1098 అడ్వైజరీ బోర్డును వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల భాగస్వామ్యంతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో కూడా బాల్య వివాహాలు జరుగుతుండటం విచారకరమన్నారు. బాలలపై వివక్ష చూపడం, వేధింపులకు గురిచేయడం కొన్నిచోట్ల అధికమవుతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందనే విషయాన్ని గ్రహించాలన్నారు. తహసీల్దార్ చైర్మన్‌గా, ఎంపీడీఓ వైస్ చైర్మన్‌గా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కన్వీనర్‌గా, మెడికల్ ఆఫీసర్ కోకన్వీనర్‌గా మండల స్థాయిలో ఏర్పడిన బోర్డులో ఇతర శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు. గ్రామ స్థాయిలో కూడా ఇదే విధంగా బోర్డులను ఏర్పాటు చేస్తామన్నారు. వాట్సప్ గ్రూప్‌ల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకునే సదుపాయం కల్పిస్తామన్నారు. చైల్డ్ లైన్ 1098 కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ బాల్య వివాహాలను ప్రోత్సహించినా, సహకరించినా.. చట్టప్రకారం రూ.లక్ష జరిమానా విధిస్తారని హెచ్చరించారు. పోక్సో చట్టాన్ని అనుసరించి జైలుకు కూడా పంపిస్తారన్నారు. సమావేశంలో సీడీపీఓ టి.నాగమణి, ఈఓపీఆర్డీ బొజ్జిరాజు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.రవికుమార్, సర్పంచ్ కుందేటి ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, చైల్డ్ వెల్ఫేర్ సిబ్బంది, మహిళా కార్యదర్శులు పాల్గొన్నారు.

శివరాత్రికి పటిష్ట బందోబస్తు



వంగలపూడి రేవు నుంచి గోదావరిలో వేసిన దారిని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

సీతానగరం: వంగలపూడి, రామచంద్రపురం రేవు నుంచి పట్టిసీమ వీరభద్రుని దర్శనానికి తరలివెళ్లే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని నార్త్‌జోన్ డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు అన్నారు. వంగలపూడి, పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలోని రామచంద్రపురం రేవుల నుంచి భక్తులు తరలివెళ్లడానికి చేసిన ఏర్పాట్లను కోరుకొండ సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్సై కె.శుభశేఖర్‌తో కలిసి గురువారం పరిశీలించారు. వంగలపూడిలో వాహనాలు పార్కింగ్ స్థలాన్ని, గోదావరిపై వేసిన నడక మార్గాన్ని పరిశీలించారు. రామచంద్రపురం నుంచి గోదావరిలో నీరు లేకపోవడంతో ట్రాక్టర్లు నేరుగా పట్టిసీమ వెళ్లడానికి అనువుగా ఉన్నందున ఆ గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం ఎక్కడ నిర్వహిస్తారనేది ఆరా తీశారు.

శివరాత్రికి ఏర్పాట్లు పూర్తి

రంగంపేట: చంద్రేడులో కొలువైయున్న కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా చంద్రశేఖర స్వామి కల్యాణానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే కల్యాణోత్సవంలో 17న ప్రత్యేక పూజా కార్యక్రమాలు, 18న కల్యాణం, 19వ తేదీ రాత్రి పుష్పోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. భక్తులందరూ వచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించాలని కోరారు.

విఘ్నేశ్వరాలయానికి రూ.50 వేల విరాళం



ఆలయ కమిటీ సభ్యులతో జక్కంపూడి గణేష్

మధురపూడి: కోరుకొండ మండలం నరసాపురంలోని విఘ్నేశ్వరస్వామి ఆలయం అభివృద్ధికి జక్కంపూడి కుటుంబం గురువారం రూ.50 వేల విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేసింది. ఆలయంలో గురువారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్ సీపీ యవజన విభాగం నాయకుడు జక్కంపూడి గణేష్ విరాళం అందజేశారు. ఆయన మాట్లాడుతూ నరసాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించినప్పుడు ఆ ఆలయ అభివృద్ధికి సహకారాన్ని అందిస్తానని మాటిచ్చానన్నారు. ఆలయాల ఏర్పాటు ద్వారా ఆధ్యాత్మిక చింతన పెరుగుతుందన్నారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి రాజశ్రీ మాట్లాడుతూ ధ్వజస్థంభం ప్రతిష్ఠాపనలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కడియాల పాపారావు, చొంగా శివయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రంగంపేట: సింగంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల నిమిత్తం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జగ్గంపేట విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు తెలిపారు. సింగంపల్లి, చిన దొడ్డిగుంట, నల్లమిల్లి, మర్రిపూడి గ్రామాలకు, వ్యవసాయ బోర్లకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



కల్యాణ శోభతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారు

అనపర్తి: స్థానిక సత్తి పోతారెడ్డి, తేతలి రామిరెడ్డి రామాలయంలో గురువారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదాంతం భాస్కరాచార్యులు, అంగర ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణంలో మేడపాటి చెల్లారెడ్డి, మహాలక్ష్మి దంపతులు పీటలపై కూర్చుని కల్యాణ క్రతువును నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్ని కల్యాణాన్ని తిలకించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కర్రి రామారెడ్డి(రామన్నతాత), తేతలి వెంకటరెడ్డి, సత్తి పోతారెడ్డి, చిర్ల వీరరాఘవరెడ్డి, ద్వారంపూడి సత్తిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా విశ్వేశ్వరస్వామి కల్యాణం



పందలపాక కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామికి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో కొలువైన కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి కల్యాణం గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. అర్చకులు గరిమెళ్ళ పవన్ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న సమారధన చేశారు. పందలపాక గౌరీ శంకర ఆలయం వద్ద అర్చకులు గరిమెళ్ళ గాంధీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ



లాలాచెరువు హైస్కూల్లో కృష్ణప్రసాద్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాజానగరం: జిల్లాస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.కృష్ణ ప్రసాద్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, పలువురి ప్రశంసలు అందుకున్నాడని హెచ్‌ఎం ఏఎస్ సుధారాణి తెలిపారు. ఆరోగ్యం - పరిశుభ్రత అనే అంశంపై ఆ విద్యార్థి తయారు చేసి, ప్రదర్శించిన ప్రాజెక్టు ఉత్తమ ప్రాజెక్టుల్లో ఒకటిగా ఎంపికైంది. ఈ నేపథ్యంలో గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆ విద్యార్థిని అభినందించారు. పరిసరాల శుభ్రతతోనే ప్రజారోగ్యం అంటూ మురుగు నీటి ఏవిధంగా రీసైక్లింగ్ చేసి, మొక్కల పెంపకానికి వాడుకోవచ్చు, తడి చెత్త, పొడి చెత్తలను ప్రజాప్రయోజనాలకు ఉపయోగపడేలా ఎలా మలచవచ్చు అనే విషయాలను ఈ ప్రాజెక్టులో విపులంగా వివరించాడన్నారు. లోయ ప్రాంతాలలో ప్రమాదాలను సెన్సార్ ఏర్పాటు ద్వారా ఏ విధంగా నివారించవచ్చునో నరేంద్రపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.వికాస్ ట్రెక్కింగ్ వెహికల్ ప్రాజెక్టు ద్వారా తెలియజేశాడన్నారు. ఆ విద్యార్థిని కూడా ఆయా పాఠశాల ఉపాధ్యాయులు అభినందించి, మరిన్ని అద్భుత ప్రయోగాలు చేసేలా అడుగులు వేయాలన్నారు.

మెళ్లూరులో పశు వైద్య శిబిరం



మెళ్లూరు పశు వైద్య శిబిరంలో పశువులకు వైద్యం చేస్తున్న వైద్యులు

బిక్కవోలు: మండలంలోని మెళ్లూరులో గురువారం నిర్వహించిన పశువైద్య శిబిరంలో 55 పశువులకు వైద్య పరీక్షలు చేశారు. పశుసంవర్ధక శాఖ జేడీ బి.చంద్రశేఖర్‌గౌడ్ శిబిరాన్ని ప్రారంభించి పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. వేసవి కాలం దృష్ట్యా పశువులను నీడ ఉండే ప్రాంతంలో ఉంచాలని సూచించారు. అనంతరం మందులను అందించారు. కార్యక్రమంలో మండపేట డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమూర్తి, అనపర్తి అసిస్టెంట్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు, మెళ్లూరు పశు వైద్యులు డాక్టర్ గొలి వీర్రాజు, పశు వైద్యులు డాక్టర్ పి.విజయ్, డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ స్వామి అన్నకూట ఉత్సవం

బిక్కవోలు: బిక్కవోలులోని లక్ష్మీనారాయణస్వామి ఆలయం వద్ద అన్నకూట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. గురువారం ఆలయం వద్ద మాఘ బహుళ ఏకాదశి పురస్కరించుకుని తిరుపతిలో జరిగే తిరుప్పావడ కార్యక్రమం తరహాలోనే ఇక్కడా కార్యక్రమం నిర్వహించారు. అన్నంతో స్వామివారి రూపం వచ్చేలా అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆ అన్నాన్ని భక్తులకు ప్రసాదంగా పంచిపెట్టారు.

ఇనుప రాడ్ల మాయంపై కేసు

బిక్కవోలు: ఇనుప రాడ్డులు మాయమైనట్లు అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం తొళ్లూరు గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ టీవీవీ సత్యనారాయణ రంగాపురంలోని వాటర్ ట్యాంకు నిర్మాణ పనులు చేయిస్తున్నారు. లేబర్ పనుల నిమిత్తం కాకరపల్లి వెంకటేష్‌కు కాంట్రాక్టర్ పనులు అప్పగించారు. అయితే సత్యనారాయణ కుమార్తె వివాహం నిమిత్తం ఇంటికి వెళ్ళి ఈ నెల 10న రంగాపురం వచ్చి చూసేసరికి రూ.90 వేల విలువైన ఐరన్ రాడ్లు కనిపించకపోవడంతో చుట్టుపక్కల విచారించి వెంకటేష్ మాయం చేసినట్లు తెలిసిందని ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుషోత్తపట్నం రైతులకు అదనపు పరిహారం

- మైనర్ ఇరిగేషన్ పనులకు టెండర్లు పిలవాలి
- ఉన్నతాధికారులను కోరిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



రాజానగరం: పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం కోసం భూములు కోల్పోయిన రైతులకు అదనపు పరిహారం అందించాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అమరావతిలో గురువారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులను కలసిన ఆయన.. జలవనరులశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్‌కు ఈ మేరకు వినతి అందించారు. కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ అంశాన్ని సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. రాజానగరం నియోజకవర్గంలో సీఎం జగన్‌తో ఆమోదించబడి, పెండింగ్‌లో ఉన్న రూ.38 కోట్ల వ్యయంతో కూడిన 53 మైనర్ ఇరిగేషన్ పనులకు త్వరగా టెండర్లు పిలవాలని కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. సీతానగరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసే ప్రతిపాదనను కూడా ఆమోదించాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. రాజానగరం పీహెచ్‌సీకి కొత్త భవన నిర్మాణానికి అనుమతి ఇవ్వాలన్నారు.

ఘనంగా భీమేశ్వరస్వామి కల్యాణం



స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న వీర్రాఘవులు, సత్యవతి దంపతులు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో బిక్కవోలు వెళ్లే రోడ్డులో ఉన్న మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి కల్యాణం గురువారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు ద్వారంపూడి వీర్రాఘవులు(పాపిరెడ్డి), సత్యవతి దంపతులు పూజల్లో పాల్గొని స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు కల్యాణ క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త వీర్రాఘవులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు.

గడప గడపకూ నిధులతో సిమెంట్ రోడ్లు



చంద్రేడులో జరుగుతున్న సిమెంట్ రోడ్డు పనులు

రంగంపేట: చంద్రేడు గ్రామంలో రోడ్ల అభివృద్ధి పనులు చురుకుగా సాగుతున్నాయి. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి చంద్రేడు గ్రామానికి మంజూరు చేసిన రూ.20 లక్షల నిధులతో గ్రామ సర్పంచ్ జాస్తి వెంకట పద్మావతి ఆధ్వర్యంలో అవసరమైన చోట సిమెంట్ రోడ్లు నిర్మిస్తున్నారు. నియోజకవర్గ అభివృద్ధి నిధులు, జలజీవన్ మిషన్ నిధులతో గ్రామంలో మంచినీటి బోరు నిర్మాణం చేపట్టినట్టు ఆమె తెలిపారు. అభివృద్ధి పనులపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్షమాపణ చెప్పాకే చంద్రబాబు అనపర్తిలో అడుగుపెట్టాలి

- ఏఎంసీ ఛైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి

అనపర్తి: టీడీపీ పాలనా కాలంలో అనపర్తి ప్రాంతానికి అన్ని విధాలుగా అన్యాయం జరిగిందని, అందుకే చంద్రబాబు క్షమాపణ చెప్పాకే అనపర్తిలో అడుగుపెట్టాలని అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. ఈ నెల 17వ తేదీన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనపర్తిలో పర్యటించనున్న నేపథ్యంలో గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కృష్ణారెడ్డి మాట్లాడారు. నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండగా వేమగిరి-సామర్లకోట కెనాల్ విస్తరణ, అభివృద్ధికి ప్రపంచ బ్యాంకు నిధులు సుమారు రూ. 280 కోట్లు నిధులు మంజూరు చేయించారన్నారు. అయితే కెనాల్ రోడ్డు కాంట్రాక్టు పనులు టీడీపీ నేత రాయపాటి సాంబశివరావు కుటుంబానికి చెందిన ట్రాన్స్‌ట్రాయ్ సంస్థ దక్కించుకుని పనులు చేయలేదన్నారు. కెనాల్ రోడ్డు అభివృద్ధి పనుల్లో జరిగిన కాలయాపన కారణంగా ప్రపంచబ్యాంకు ఈ ప్రాజెక్టు నుంచి వెనుదిరిగిందన్నారు. దీంతో రహదారి అభివృద్ధి జరగక అనపర్తి ప్రాంత ప్రజలకు తీవ్ర నష్టం కలిగిందన్నారు. అందుకే చంద్రబాబు ఈ ప్రాంత ప్రజలకు క్షమాపణ చెప్పిన తరువాతే అనపర్తిలో పర్యటించాలని డిమాండ్ చేశారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



బిక్కవోలు సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో జేఏ ఝాన్సీ

బిక్కవోలు: మండలంలోని అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో జేఏ ఝాన్సీ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం వద్ద సచివాలయం వెల్ఫేర్, ఏఎన్ఎం మహిళా సంరక్షణ, ఇంజినీర్ అసిస్టెంట్, పాఠశాల హెచ్‌ఎంతో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నాడు-నేడు పనులు నాణ్యతగా చేయాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పుకప్పుడు పరివేక్షించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు ఏ గ్రేడ్ సాధించడానికి పాఠశాల హెచ్‌ఎంలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెస్టారెంట్లలో విజిలెన్స్ తనిఖీలు

రాజమహేంద్రవరం రూరల్: విజిలెన్స్ ఎస్పీ పీవీ రవికుమార్ ఆధ్వర్యంలో విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు గురువారం బొమ్మూరులోని వివిధ రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించారు. దీవెన టిఫిన్ సెంటర్‌లో వాణిజ్య సిలిండర్లకు బదులు మూడు డొమెస్టిక్ (గృహ) సిలిండర్లు వినియోగిస్తున్నారు. అలాగే వైష్ణవి ఫుడ్‌మేజిక్ హోటల్‌లో ఆరు డొమస్టిక్ సిలిండర్లను గుర్తించారు. ఆ రెస్టారెంట్ల యజమానులపై 6ఏ కేసు నమోదు చేసి, తొమ్మిది గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ పీవీ రవికుమార్ మాట్లాడుతూ వంట గ్యాస్ సిలిండర్ల వినియోగంలో అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలో కార్యాలయ ఇన్‌స్పెక్టర్ రమేష్, తహసీల్దార్ విజయకుమార్, సివిల్ సప్లయ్స్ డిప్యూటీ తహసీల్దార్ జీడీ మల్లేశ్వరి పాల్గొన్నారు.